నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 సంచిక: 45 | మంగళవారం, 14 జూలై 2026 | పేజీలు - | వెల : 3/-




# మక్తల్ అభివృద్ధికి.. చారిత్రాత్మక అడుగు..

- ₹237 కోట్లతో మక్తల్–నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు శంకుస్థాపన
- ప్రజా ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రులు వాకాటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, జూపల్లి కృష్ణారావు



**వాస్తవ తెలంగాణ** మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం కోసం విచ్చేసిన రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఘన స్వాగతం పలికారు.అనంతరం నారాయణ పేట రోడ్డులో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంకతో పాటు ప్రజాప్రతినిధులు కలిసి రూ.237 కోట్లతో నిర్మించనున్న మక్తల్-నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... మక్తల్ నియోజకవర్గంలో ఈరోజు ప్రారంభమైన రోడ్ల నిర్మాణ పనులు చారిత్రాత్మకమైనవని అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల అవసరాలనే ప్రాధాన్యంగా తీసుకొని ఈ భారీ రహదారి ప్రాజెక్టులను మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల రవాణా కష్టాలు తొలగించాలనే సంకల్పంతో రూ.237 కోట్లతో మక్తల్-నారాయణపేట నాలుగు లైన్ల రహదారిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి సొంత ప్రయోజనాలకు పాకులాడింది అన్నారు. పూర్తిగా వెనుకబడిన మక్తల్ నియోజకవర్గం పూర్తి అండగా ఉంటుందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఎప్పుడు ఈ ప్రాంత అభివృద్ధి కోసం పరితపిస్తుంటారని అన్నారు . పట్టుబట్టి మరి మక్తల్ నారాయణపేట రోడ్డులో నాలుగు లైన్ల రోడ్డుగా వేసేందుకు మంత్రి వాకిటి శ్రీహరి నిధులు కోరడంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు .వీలైనంత త్వరగా రోడ్డును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి అధికారులు కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని త్రిప్రాస్ పల్లి నుండి మక్తల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు .అనంతరం కాచ్ వార్ వద్ద మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి లకు వాకిటి శ్రీహరి స్వాగతం పలికారు.అక్కడి నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీలో ముగ్గురు మంత్రులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి నేస్తాలు కౌగిలింతల్లో కరిగిన కాలం

పాత జ్ఞాపకాలతో భావోద్వేగమైన 1975-76 SSC బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం

2

## టెట్ ఫలితాలు విడుదల

- మొత్తం 1,15,028 మంది అభ్యర్థుల హాజరు
- అర్హత సాధించింది కేవలం 50 వేల మందే..

**హైదరాబాద్,** వాస్తవ తెలంగాణ తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 ఫలితాలను సోమవారం మధ్యాహ్నం విడుదల చేశారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఆధారంగా ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ https://tgtet.aptonline.in లో చూసుకోవచ్చని టెట్ చైర్మన్ నవీన్ నికోలస్ తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన టీజీ టెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 1,15,028 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఫలితాల్లో అభ్యర్థుల మార్కులు, అర్హత తదితర వివరాలు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 16వ తేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షగా ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ టెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,15,028 మంది అభ్యర్థులు హాజరవగా, వారిలో కేవలం 50,544 మంది మాత్రమే క్వాలిఫై అయ్యారు. విద్యాశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది టెట్ పరీక్షల్లో మొత్తం 43.94 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్1, పేపర్2 ఫలితాలు రెండూ ఒకేసారి అందుబాటులోకి రాగా, క్వాలిఫై అయిన అభ్యర్థుల వివరాలను కేటగిరీల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచారు.

## పోలీసుల నిర్లక్ష్యం.. హంతకుడిలో సైకోపాథిజం



**వాస్తవ తెలంగాణ** భారత్ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ షాబాద్ పోలీస్ స్టేషన్ ఏరియాలో గల దైవాలగూడ గ్రామంలో ఆరుగురి దారుణ హత్యలకు పోలీసుల నిర్లక్ష్యం, హంతకుడు రాజ్‌కుమార్‌లోని సైకోపాథిజమే కారణమనే చర్చ సమాజంలోని వివిధ వర్గాలలో సాగుతున్నది. అదే సమయంలో ఇలాంటి సమస్య ఏర్పడడానికి గల కారణాలు, ఎలాంటి పరిష్కార మార్గాలను అన్వేషించాలనే అంతర్మథనం సీనియర్ ఐపీఎస్ అధికారులలో జరుగుతున్నది. రాష్ట్రం ఉలిక్కి పడే తీరులో రాజ్‌కుమార్ ఏకంగా ఆరుగురిని అత్యంత కిరాతకంగా శుక్రవారం రాత్రి సామూహిక ఊచకోతకు పాల్పడ్డాడు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రమే గాక యావత్ భారత దృష్టి ని ఆకర్షించింది. ముఖ్యంగా దైవాలగూడ గ్రామ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. మరోవైపు పోలీస్ అధికారులే గాక సామాజిక, మానసిక శాస్త్రవేత్తలలో ఈ ఘోర ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. మే 16న తన గ్రామానికి చెందిన ఇంటర్ చదుతున్న మైనర్‌పై రాజ్‌కుమార్ లైంగికదాడికి పాల్పడ్డాడని షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. దీంతో 26న నిందితుడిని అరెస్టు చేసి పోలీసులు జైలుకు పంపించారు. కాగా బెయిల్‌పై బయటకు వచ్చిన రాజ్‌కుమార్.. శుక్రవారం(జులై 10న) రాత్రి మొదట తనపై కేసు పెట్టిన బాలిక ఇంటికెళ్లి ఆమె తల్లి, నానమ్మ లను కిరాతకంగా గొంతు కోసి చంపారు. ఆ తర్వాత బాలికను లాక్కెల్లి చెరువు గట్టు సమీపంలో హత్య చేశాడు. అక్కడి నుంచి నేరుగా తన ఇంటికి వచ్చిన రాజ్‌కుమార్.. తన భార్య, ఇద్దరు పిల్లలను కూడా అత్యంత దారుణంగా చంపి పారిపోవడం ఆ గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. ఒకేసారి ఇంతటి ఘోర అకృత్యం జరగడానికి స్థానిక పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్థులు రహదారిపై బైటాయించి ఆందోళన చేసే పరిస్థితి ఏర్పడింది. రాజ్‌కుమార్ వంటి అత్యంత క్రూరమైన స్వభావం కలిగిన రాక్షసుడిపై పోలీసులు... బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయనపై కన్నేసి ఉంచకపోవడం ఈ ఘోర కలికి దారి తీసిందనే ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తాయి. ముఖ్యంగా మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించి విచ్చలవిడిగా తిరుగుతూ మైనర్‌పై లైంగికదాడికి పాల్పడి జైలుకు వచ్చిన ఈ నేరస్తుడికి సైకాలజిస్ట్ తో జైల్ అధికారులు కౌన్సిలింగ్ చేయించి అతని మానసిక పరిస్థితి ని ముందుగానే అంచనా వేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని మానసిక శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించే వారు సైకోపాథిజానికి గురవుతారని వారు అంటున్నారు. గంజాయి సేవించిన వారు తమను ఎవరు ఎదిరించినా, తమ పనులకు ఎవరు అడ్డుపడినా, తమను ఎవరు తీవ్రంగా అవమానించినా వారిని భౌతికంగా రూపుమాపాలనే తీవ్రమైన ఉన్మాద స్థాయికి వారి మానసిక స్థితి చేరుకుంటుందనీ, దానినే సైకోపాథిజం అంటారనే నిపుణులు తెలిపారు. ఇదే పరిస్థితికి చేరుకున్న రాజ్‌కుమార్ ఏ మాత్రం దయ, జాలి లేకుండా ఆరుగురిని మట్టుపెట్టారని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే ఊహించని రీతిలో ఒకే గ్రామంలో ఆరుగురు దారుణ హత్యకు గురి కావడం పట్ల రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మొదలుకుని ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారుల వరకు నిశితంగా దృష్టి ని సారించారు. ఇటీవలనే సీవీ ఆనంద్ సైతం తమ ఏరియాలలో తీవ్ర ఘటనలు జరిగినపుడు కేవలం కింది స్థాయి పోలీస్ అధికారులపై వదిలివేయకుండా సీనియర్ అధికారుల కూడా రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ దైవాలగూడ గ్రామంలో నరరూప రాక్షసుడు రాజ్‌కుమార్‌ను నివారించడంలో పోలీసులు కూడా నిర్లక్ష్యం వహించారని సమాజంలోని అని వర్గాల నుంచి వస్తున విమర్శలు పోలీస్ ఉన్నతాధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన విధంగా స్పందించ లేదనే ఆరోపణలు విపక్షాల నుంచి వస్తున్నాయి.

# 50 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి నేస్తాలు కౌగిలింతల్లో కరిగిన కాలం

## పాత జ్ఞాపకాలతో భావోద్వేగమైన 1975-76 SSC బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ2009లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆ రోజుల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డానుచెప్పుకోలేనిఅవమానాలు ఎదుర్కొన్నాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎలాంటి అక్రమాలకుఅవినీతికి పాల్పడకుండా జీవించానునా వల్ల ఎవరికీ నష్టం జరగకూడదు ఎవరికీ కష్టం కలగకూడదనే ఆలోచనతో పనిచేశాను పదో తరగతి గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కాలం పరుగులు తీసింది జీవితాలు మారాయి బాధ్యతలు పెరిగాయిఎవరి దారిలో వారు సాగిపోయారు కానీ 50 ఏళ్ల క్రితం పాఠశాల గదుల్లో చిగురించిన స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. అర్ధ శతాబ్దం తర్వాత చిన్ననాటి నేస్తాలంతా ఒక్కచోట చేరడంతో మల్కాపూర్ శివారులో ఆత్మీయత వెల్లివిరిసింది సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1975-76 నాటి బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం అపూర్వ జ్ఞాపకాలకు వేదికైంది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని తన పదో తరగతి సహచరులతో కలిసి బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారుఎన్నో ఏళ్ల తర్వాత ఎదురుపడిన నేస్తాలను చూడగానే ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.ఎలా ఉన్నావురాఅంటూ పలకరించుకుంటూ ఆనాటి పాఠశాల రోజులుతరగతి గదుల్లో చేసిన అల్లరిగురువుల మందలింపులుకలిసి పంచుకున్న నవ్వులను గుర్తుచేసుకున్నారు. కొన్ని జ్ఞాపకాలు నవ్విస్తే మరికొన్ని కళ్లను చెమ్మగిల్లేలా చేశాయితమకు అక్షరాలు నేర్పి, జీవితానికి దారి చూపిన గురువులు సైతం సమావేశానికి హాజరుకావడంతో పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గురువులను ఆప్యాయంగా పలకరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు 50 ఏళ్ల నాటి మిత్రులందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు బ్యాచ్‌మేట్లు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఆత్మీయ కలయికలు మున్ముందు కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి వచ్చిన చిన్ననాటి మిత్రులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శాలువాలతో సత్కరించి తన ఆత్మీయతను చాటుకున్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూచాలా ఏళ్ల తర్వాత నా పదో తరగతి స్నేహితులందరినీ ఇలా ఒకే చోట చూడటం మాటల్లో చెప్పలేని ఆనందాన్ని ఇస్తోంది. చిన్నతనంలో ఎన్నో కష్టాలు చూశాం ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాం. చూస్తుండగానే 50 ఏళ్లు గడిచిపోయాయిఈ వయసులో కూడా మనమంతా సంతోషంగా కలుసుకోవడం నిజంగా మన అదృష్టందేవుడి దయఅని అన్నారు. మీలో ఎవరికైనా ఏ కష్టం వచ్చినాఅది నా పరిధిలో పరిష్కరించగలిగేది అయితే తప్పకుండా అండగా ఉంటా మీకు సహాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటానా రాజకీయ ప్రయాణంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానంటే అందులో మీ ప్రేమ, మీ కృషి, మీ ఆశీస్సులు మరువలేనివిఅని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎలాంటి అక్రమాలకు, అవినీతికి పాల్పడకుండా జీవించాను నా వల్ల ఎవరికీ నష్టం జరగకూడదు.. ఎవరికీ కష్టం కలగకూడదనే ఆలోచనతో పనిచేశాను ఈ రోజు నా చిన్ననాటి స్నేహితులైన మీ అందరి ముందు తలెత్తుకుని నిలబడేలా దేవుడు నాకు అవకాశం ఇచ్చాడుఅంతకంటే నాకు కావాల్సింది ఏముంటుంది అన్నారు తన భార్య సహకారం ఎంతో ఉందని చింత ప్రభాకర్ గుర్తుచేసుకున్నారునేను ఎమ్మెల్యే కావడానికిమున్సిపల్ చైర్మన్‌గా పనిచేయడానికి నా వెనుక మొదటగా నిలిచింది నా భార్య.నేను ప్రజల మధ్య తిరుగుతున్నప్పుడు ఆమె కుటుంబాన్ని చూసుకోకపోయి ఉంటే నా ప్రయాణం మరోలా ఉండేదినా జీవిత ప్రయాణంలో ఆమె సహకారాన్ని ఎప్పటికీ మరచిపోలేనుఅని అన్నారు. 2009లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆ రోజుల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డాను చెప్పుకోలేని అవమానాలుఎదుర్కొన్నానుకానీ ప్రజల నిండు మనసు, వారి ప్రేమ అండదండలే నన్ను నిలబెట్టాయిఆ ప్రజల ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా గెలిచానుఅని తెలిపారు. చివరగా చిన్ననాటి మిత్రులతో కలిసి నవ్వులు పంచుకుంటూ ఫొటోలు దిగుతూ చింత ప్రభాకర్ ఉత్సాహంగా గడిపారు. 50 ఏళ్ల కాలాన్ని వెనక్కి తిప్పినట్టుగా సాగిన ఈ ఆత్మీయ సమ్మేళనం. ప్రతి ఒక్కరి హృదయంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకంగా నిలిచిపోయింది కార్యక్రమంలో రాములు గౌడ్, ఎం. వెంకటేశం జనార్దన్ మనోహర్, కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్ సుధీర్ రెడ్డి చిక్కుల మల్లేశం రామప్ప, శ్రీధర్ రెడ్డి చక్రపాణి విఠల్, పెద్దగొల్ల ఆంజనేయులు అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరి శ్రీధర్ గౌడ్




**వాస్తవ తెలంగాణడైలీ న్యూస్ ఆల్వాల్ /.**నాజీగూడకు చెందిన బిఆర్ఎస్ మహిళా సీనియర్ కార్యకర్త టి. సరిత భర్త టి. బాలరాజు మరణించడంతో వారి కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన ముఖ్య వివరాలు:ఆర్థిక సహాయం: బాలరాజు మరణంతో కృంగిపోయిన కుటుంబానికి శ్రీధర్ గౌడ్ తన వంతుగా ఆర్థిక సాయం అందించారు.పిల్లల చదువుకు మద్దతు: బాధిత కుటుంబంలోని పిల్లల స్కూల్ చదువుల కోసం, పుస్తకాల (దీశీశీం) కొనుగోలుకు ప్రత్యేకంగా సహాయం చేశారు.భరోసా: "బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని శ్రీధర్ గౌడ్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు: లిఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగరుల్ల సురేష్లిసాయి జమ్దార్, అమృత సుదర్శన్ రాజు, మురళీ గౌడ్, సరిత, శివ, శంకర్ యాదవ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర పోలీస్ క్రీడల్లో కాంస్యం అమర్నాథ్‌కు ఎస్పీ అభినందనలు




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** రాష్ట్రస్థాయి తెలంగాణ పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లా పోలీసు శాఖకు చెందిన కానిస్టేబుల్ రసాల అమర్నాథ్ ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి తెలంగాణ పోలీస్ క్రీడల్లో ఫెన్సింగ్ విభాగంలో మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అమర్నాథ్ ను శాలువాతో సన్మానించి అభినందించారు.క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనే విజయానికి పునాదులని ఎస్పీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లోనూ ప్రతిభ కనబర్చి మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అమర్నాథ్ విజయం జిల్లా పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐలు రాజశేఖర్ రెడ్డి, జార్జ్, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

# నులిపురుగుల నిర్మూలనతోనే బాలల ఆరోగ్యం

## అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలి.
## నులిపురుగుల నివారణకు తల్లిదండ్రుల సహకారం అవసరం.
## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.






**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** బాలల్లో నులిపురుగుల నివారణ ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కు బాటలు పడతాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించి నులిపురుగుల నిర్మూలనకు సహకరించాలని పిలుపునిచ్చారు.మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గణేశ్వర్‌తో కలిసి విద్యార్థినులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలని సూచించారు. మట్టిలో ఆడుకోవడం వల్ల నులిపురుగుల గుడ్లు శరీరంలోకి చేరి రక్తహీనత, పోషకాహార లోపం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక వికాసం మెరుగుపడి చదువు, ఆటపాటల్లో చురుకుదనం పెరుగుతుందని తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రభుత్వం ఉచితంగా అల్బెండజోల్ మాత్రలు అందజేస్తోందన్నారు. పిల్లలు పాదరక్షలు ధరించడం, గోర్లు చిన్నగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గణేశ్వర్ మాట్లాడుతూ.. అల్బెండజోల్ మాత్రల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, మాత్రలు తీసుకోని పిల్లలకు ఈ నెల 20న మాప్‌అప్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో మాత్రల పంపిణీ కొనసాగుతోందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. జయశ్రీ, మాస్ మీడియా అధికారి అన్వర్, మెడికల్ ఆఫీసర్ డా. సాయి గౌతమ్, సీహెచ్‌వో ప్రదీప్, పీహెచ్‌ఎన్ లిల్లీ గ్రేస్, రిటైర్డ్ హెచ్‌ఈవో రమేష్, సిస్టర్ మేరీ, సునీత, ల్యాబ్ టెక్నీషియన్ వంశీధర్ రెడ్డి, రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్తాయికోట శివాలయంలో ఎస్పీ ప్రత్యేక పూజలు



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సోమవారం ముత్తాయికోట శివాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎస్పీకి పూర్ణకుంభ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ చారిత్రక విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యం గురించి ఆలయ అర్చకులు, నిర్వాహకులతో ఎస్పీ చర్చించారు. జిల్లా ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు ఎస్పీని మర్యాదపూర్వకంగా అభివాదం చేశారు.ఈకార్యక్రమంలో హవేలీఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి

**ఆస్పత్రిని తనిఖీ చేయాలని ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు సీపీఎం వినతి**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** మెదక్ మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, జిల్లా కలెక్టర్ స్వయంగా ఆస్పత్రిని తనిఖీ చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మంచు నాగేష్‌కు వినతిపత్రం సమర్పించారు.ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన సందర్భంగా గుర్తించిన సమస్యలను వినతిపత్రంలో ప్రస్తావించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కే. మల్లేశం ఆస్పత్రిలో తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలని, ఇన్‌పేషెంట్లకు వైద్య పరీక్షల నివేదికలను వెంటనే అందజేయాలని, నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించడంతో పాటు రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రి ప్రధాన ద్వారం వరకు వీధిదీపాలు, ఆస్పత్రి ఆవరణలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, పేషెంట్ అటెండెంట్ రెస్ట్‌రూమ్‌ను మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని, స్నానాల ప్రాంతంలో తాగునీటి ట్యాప్‌లు ఏర్పాటు చేసి పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. శానిటరీ సిబ్బందిని పెంచడంతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రంలోని డిమాండ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ మంచు నాగేష్‌కు, జిల్లా కలెక్టర్ స్వయంగా ఆస్పత్రిని తనిఖీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఏ. మల్లేశం కోరారు.

# చేనేత సహకార సంఘాల చైర్మన్ లకు డైరెక్టర్లకు సన్మానం...

**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగళ పేట్ మండల పరిధిలోని గ్రామమైన హనుమంతరావు పేటలో ఇటీవల ఏకగ్రీవంగా గెలిచిన చేనేత సహకార సంఘాల చైర్మన్ లకు డైరెక్టర్లకు సోమవారం శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శాలువా మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. మంగల్ పేట సొసైటీకి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కూచిని ప్రకాష్, హనుమంతరావుపేట్ సొసైటీకి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్యాల సాయిలు, డైరెక్టర్లకు నారాయణఖేడ్ పద్మశాలి సంఘం అధ్యక్షులు గున్నాల నర్సింలు,కోశాధికారి చిప్ప అనంతం, ఉపాధ్యక్షులు మెట్టు శ్రీనివాస్,సామల సంగన్న జనరల్ సెక్రెటరీ గోస్క శ్రీనివాస్,బాయిని శ్రీనివాస్, పేర్ల కేశవులు,రాములు ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో కృష్ణ చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం వారిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు చిప్ప సరిత, ఉపాధ్యక్షులు కొక్కుల జోత్స,సామల సుజాత, కోశాధికారి అంబటి ఇందు, సభ్యులు స్వరూప, విజయలక్ష్మి,రూప తదితరులు పాల్గొన్నారు.



# నారాయణఖేడ్ నుండి పాదయాత్ర...

# మాజీ మంత్రి హరీష్ రావ్..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ నుండి జహీరాబాద్ వరకు బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టుల కోసం త్వరలో రైతులు బిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేస్తామని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సోమవారం నారాయణఖేడ్ కింగ్స్ ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్ ప్రోగ్రాం లో ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త వివిధ గ్రామాల్లో పట్టణాల్లో అందరి ఓట్లు నమోదు చేసేలా ఆక్టివ్ గా పని చేయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. సింగూర్ ప్రాజెక్టు రిపేర్ల పేరిట ఖాళీ చేసి పనులు 30% మాత్రమే పూర్తి చేశారన్నారు. సక్రమంగా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ఎక్కడి నుంచి ఇస్తుందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టులను అటకెక్కించిందని బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఈపాటికి ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్ళు ఇచ్చే వాళ్ళమన్నారు. త్వరలోనే నారాయణఖేడ్ బసవేశ్వరుని సాక్షిగా జహీరాబాద్ లోని కేతకి సంగమేశ్వర్ ఆలయం వరకు రైతులతో పెద్ద ఎత్తున పాదయాత్ర కార్యక్రమాన్ని చేపడతామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని దేవుళ్ళ మీద ఒట్లు వేసి పనులు చేస్తానని, పనులు చేయకపోగా అడిగిన వాళ్లపై విరుచుకుపడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలతో మోసపోయారని చెప్పారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళా విభాగం సభ్యులు,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

**ప్రతి వినతిపై పారదర్శక విచారణ.. బాధితులకు సత్వర న్యాయం.**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్‌రావు.**



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ ప్రతినిధి :-** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్‌రావు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చూడాలని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# బైక్ చోరుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ -కేసు ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన డీసీపీ ఎన్. కోటి రెడ్డి




**పేట్ బషీరాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేర ముఠాను పేట్-బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. మైసమ్మగూడ అపారెల్ పార్క్ సమీపంలో ప్రత్యేక నిఘా నిర్వహించిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు, ఇద్దరు బాల నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో నిందితులు పరస్పరం ముఠాగా ఏర్పడి, లక్ష్య ప్రాంతాలకు కారులో చేరుకుని, పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపిన ద్విచక్ర వాహనాలను మాస్టర్ కీల సాయంతో చోరీ చేసి వేగంగా అక్కడి నుంచి పరారవుతున్నట్లు తేలింది. ఈ ముఠా ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 21 ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. విచారణ సందర్భంగా 19 కేసుల్లో తమ ప్రమేయాన్ని నిందితులు అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 21 మోటార్ సైకిళ్లు, ఒక సుజుకి ఎర్టిగా కారు, మూడు మొబైల్ ఫోన్లు, రెండు మాస్టర్ కీలు, రెండు కట్టర్లు, రెండు స్క్రూడ్రైవర్లు, ఐదు ఎలక్ట్రికల్ స్విచ్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు వినియోగించిన పరికరాలతో పాటు వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడం కేసు దర్యాప్తులో కీలక మలుపుగా మారింది. ఈ కేసును అదనపు డీసీపీ పురుషోత్తం మార్గదర్శకత్వంలో, ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు ఛేదించాయి. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని సమన్వయం చేసి నిందితుల కదలికలను గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. శాస్త్రీయ దర్యాప్తు, క్షేత్రస్థాయి సమాచార సేకరణతో స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించడం విశేషమని అధికారులు పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన పేట్-బషీరాబాద్ పోలీసు బృందాన్ని కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ అభినందించారు. నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు కల్పిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్క్ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం

-ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి.....
-బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సమగ్రంగా నమోదు చేపట్టాలి
-18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలి
-ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి అందజేయాలని విజ్ఞప్తి
-ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని వ్యాఖ్య



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి సోమవారం బూత్ లెవెల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్ఓలతో మాట్లాడుతూ, ఓటరు నవోదు ప్రక్రియను ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండే విధంగా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు బీఎల్ఓలు అందజేస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సక్రమంగా నింపి తిరిగి సమర్పించాలని వీరారెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నవోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్న ఆయన, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు అయ్యేలా బాధ్యతతో వ్యవహరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి.



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి.:-** యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మెదక్ పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను, భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితం కూడా దెబ్బతింటుందని వివరించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, డీటీఎఫ్ సీఐ జే. గోపాల్, ఎక్సైజ్ ఎస్ఐ బి. మాన్‌సింగ్, సిబ్బంది సందీప్, మధుసూదన్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మీ ఓటు, మీ హక్కూ, మీ బాధ్యత నాగారం డివిజన్ ప్రజలకు కాంగ్రెస్ నాయకుల సూచన...



**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ లో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (Special Intensive Revision) ప్రక్రియ త్వరలో ముగియనున్నందున, ఎన్యూమరేషన్ ఫార్మ్‌లు తీసుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే వాటిని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు (బి ఎల్ ఓ) అందజేయాలని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. మీరు తీసుకున్న ఎన్యూమరేషన్ ఫార్మ్ పైభాగంలోనే మీ బీఎల్ఓ పేరు మరియు ఫోన్ నంబర్ ఉంటాయి. కాబట్టి సంబంధిత బీఎల్ఓను సంప్రదించి, మీరు నింపిన ఫార్మ్‌లను రెండు రోజుల్లోపు తప్పనిసరిగా సమర్పించండి. ఒకవేళ మీరు ఇంకా ఫార్మ్ తీసుకోకపోయినా లేదా మీ ఓటు ఏ బూత్‌లో ఉందో తెలియకపోయినా, వెంటనే ఈ సి ఐ ఈ నెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, "సెర్చ్ యూఆర్ నేమ్ ఆప్షన్‌ను క్లిక్ చేయండి. అందులో మీ ఈపిక్ నంబర్ (ఓటర్ ఐడి నెంబర్) లేదా ఇతర వివరాలను నమోదు చేస్తే మీ బూత్ నంబర్ మరియు సంబంధిత బీఎల్ఓ వివరాలు తెలుస్తాయి. ఆ తర్వాత మీ బీఎల్ఓను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫార్మ్‌ను తీసుకొని, పూర్తిగా నింపి రెండు రోజుల్లోపు సమర్పించండి. ఫార్మ్‌ను సమర్పించని పక్షంలో మీ ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఓటరు, ప్రతి కుటుంబం ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని మనవి చేస్తున్నాము. మీ ఓటు -- మీ హక్కు, మీ బాధ్యత. ఎన్యూమరేషన్ ఫార్మ్‌ను వెంటనే నింపి మీ సంబంధిత బీఎల్ఓకు అందజేయాలి అని నాగారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# స్టూడెంట్స్ కు స్టీల్ వాటర్ బాటిల్ల పంపిణీ..




**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగలిగిద్ద మండలం మొర్గి తెలంగాణ మోడల్ పాఠశాల మరియు కళాశాలలో సోమవారం విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అపెక్స్ ఆసుపత్రి, సంగారెడ్డికి చెందిన సునీల్ కుమార్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, నాగలిగిద్ద ఎస్సై రామకృష్ణ విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అపెక్స్ ఆసుపత్రికి చెందిన సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం మొర్గి, గోడేగాం, షాపూర్ పాఠశాలల విద్యార్థులకు కూడా స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ, సర్పంచ్ అన్నపూర్ణ, మాజీ ఎంపీటీసీ శంకరయ్య, స్వామి, గున్న సంగమేశ్వర్ గుప్త, చిలప్చేడ్ ఎంఈఓ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# "గోల్ ఫిట్నెస్" యూనిసెక్స్ సెలూన్ ను ప్రారంభించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ...




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** 128 – చింతల్ డివిజన్ స్టార్ లైట్ అపార్ట్మెంట్స్ వద్ద రాజు, రవీందర్, సోనూల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "గోల్ ఫిట్నెస్ ను బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నేటి గజిబిజి జీవితంలో మానసిక ఉల్లాసంతో పాటు శరీరక దృఢత్వం ఎంతో అవసరమని అన్నారు. ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో ఫిట్నెస్ ను అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ, సీనియర్ నాయకులు కర్నెకంటి మల్లేష్, ఈకె. శ్రీశైలం యాదవ్, వరప్రసాద్, వెంకటేష్, సామ్రాట్, జల్దా లక్ష్మీనాథ్, ఎర్వ సాయికిరణ్ (బంటి), గంజి ఉదయ్, అల్లావుద్దీన్ (అల్లూ), రాజు, శ్రీనివాస్, ఎస్.కె. మీరా, నాజర్, సోనూ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ ఆలయంలో మాజీ మంత్రి పూజలు



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్.** నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి తన్నీరు హరిష్ రావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనూరు మండల పరిధిలోని బోరంచ గ్రామ శివారులో ఉన్న నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి హరీష్ రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డితో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నారాయణఖేడ్ లో సర్ కార్యక్రమంలో భాగంగా హజరైన అనంతరం బోరంచకు వెళ్లి దర్శించుకున్నారు. మాజీ మంత్రికి ఆలయ పూజారులు సిద్దు స్వామి, నగేష్ స్వామి ఘనంగా ఆలయంలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహిరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్రెడ్డి,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపస్మారక స్థితిలో లభ్యమైన మహిళ.. గుర్తించిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వండి



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** మెదక్ పట్టణంలోని సాయి దత్త థియేటర్ సమీపంలో ఆదివారం ఓ మహిళకు ఫిట్స్ రావడంతో రోడ్డుపై అపస్మారక స్థితిలో కనిపించారు. విధుల్లో ఉన్న మెదక్ టౌన్ పోలీస్ పెట్రో కార్ సిబ్బంది ఆమెను గుర్తించి వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు.ప్రస్తుతం ఆ మహిళ తన వ్యక్తిగత వివరాలు లేదా చిరునామా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని మెదక్ టౌన్ సీఐ మహేష్ తెలిపారు. ఈ మహిళను ఎవరైనా గుర్తించినా లేదా ఆమె కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా మెదక్ టౌన్ పోలీసులను 8712657913, 9573553398 నంబర్లలో సంప్రదించాలని సీఐ మహేష్ విజ్ఞప్తి చేశారు.

## "శ్రీ అభయాంజనేయ స్వామి, పోచమ్మ దేవస్థానము" నూతన కమిటీ ఎన్నిక.....



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...**సోమవారం 128 - చింతల్ డివిజన్ ఎన్ ఎల్ బి నగర్ "శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం మరియు పోచమ్మ దేవస్థానం నూతన కమిటీ సభ్యులు" పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆలయ కమిటీ సభ్యులకు ముందుగా నా శుభాకాంక్షలు. ఆలయ అభివృద్ధిలో కమిటీ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ ఎం.బసవరాజ్, సలహాదారులు జేమ్స్, ఆకుల ప్రభాకర్ గుప్తా, ప్రెసిడెంట్ వేముల నాగరాజు గుప్తా, వైస్ ప్రెసిడెంట్ గుంజరి నరేష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వెంకటేష్, జనరల్ సెక్రెటరీ జి.క్రిష్ణ, ట్రెజరర్ వి.కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా తానికిల్లో జవహర్ నాగర్ పోలీస్ అధికారులు..

**మైనర్, మాదక ద్రవ్యాలు, డ్రంకన్ డ్రైవ్ ల పై అవగాహన కార్యక్రమంలో జవహర్ నాగర్ పోలీస్ లు. -డ్రంకన్ డ్రైవ్ చేసినా వ్యక్తి పై కేసు నమోదు..**






**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా, 12.07.2026న, సి ఐ, ఎస్ ఐ,ఎం. శ్రీనివాస్ డిఐ, పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు ఏఆర్ సిబ్బందితో కలిసి, రిజిస్ట్రేషన్ కాలనీలో 3 గంజాయి హాట్‌స్పాట్‌లను గుర్తించాము. 3 వాహనాలను అదుపులోకి తీసుకుని, మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి, వాహన తనిఖీ నిర్వహించాము. అలాగే ఒక అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించాము. ఈ కార్యక్రమంలో, జవహర్ నాగర్ పోలీస్ అధికారులు ప్రజలతో మాట్లాడి, సైబర్ క్రైమ్, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల వినియోగం మరియు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించమని తెలిపారు. ఈ క్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక సేవకు 'ఎక్సలెంట్ అవార్డు--2026'.. కోలా రవీందర్ ముదిరాజ్‌కు ఘన సత్కారం

**-సుజనాన ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో వైభవంగా సకల కళా సమ్మేళనం**
**-దిల్‌సుఖ్‌నగర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో అట్టహాసంగా వేడుకలు**
**-మాజీ కేంద్ర మంత్రి డా. వేణుగోపాల చారి చేతుల మీదుగా అవార్డు ప్రదానం**
**-పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై రవీందర్ సేవలను కొనియాడిన అతిథులు**
**-విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం**
**-'అవార్డు మరింత బాధ్యతను పెంచింది.. ప్రజాసేవలో మరింత చురుకుగా ఉంటా' -- కోలా రవీందర్ ముదిరాజ్**



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** సుజనాన ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సకల కళా సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎక్సలెంట్ అవార్డు--2026ను సామాజిక, పర్యావరణ సేవల్లో విశేష కృషి చేస్తున్న కోలా రవీందర్ ముదిరాజ్కు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా హాజరై అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల చారి మాట్లాడుతూ, సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను గౌరవించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కోలా రవీందర్ ముదిరాజ్ పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, ప్రతి ఇంటి స్థలంలో ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని కొనియాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ఆయన చేస్తున్న ప్రచారం అభినందనీయమని, చిన్నారులకు ఈతపై అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషి సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆయన ఆశయాలు నెరవేరాలని భగవంతుడిని, ప్రభుత్వాన్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. చిన్నారుల కళా ప్రతిభను వెలికితీసే వేదికల అవసరాన్ని ప్రస్తావించిన వేణుగోపాల చారి, ప్రస్తుతం పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. పిల్లలకు ఫోన్లు ఇవ్వడం కంటే నృత్యం, సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. ఆర్.ఆర్. పిల్లేకు కూడా ప్రత్యేక అవార్డును అందజేశారు. ఈ వేడుకలో రాజేంద్ర కుమార్ పూనా (ఆర్టిస్ట్), డాక్టర్ సముద్రాల శ్రీదేవి, డాక్టర్ భాగ్యలక్ష్మి రెడ్డి, వీరభోగ వసంతరాయులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, ప్రేక్షకులు కళా ప్రదర్శనలను ఆస్వాదిస్తూ చప్పట్లతో ఆడిటోరియంను మార్మోగించారు. అవార్డు అందుకున్న అనంతరం కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజల ఆశీస్సులతో పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటానని, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. భగవంతుడు తనకు ఆయురారోగ్యాలు ప్రసాదించి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు.

## అమలుకు నోచుకోని ప్రభుత్వ జర్నలిస్టుల సంక్షేమ హామీలు... ---నిరసనగా

**టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా**

**--జర్నలిస్టు ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నా టి డబ్ల్యు జె ఎఫ్..**



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్బంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క రెస్టారెంట్,షాపింగ్ మాల్ లో సి సి కెమేరాలు తప్పనిసరి

**--జవహర్ నాగర్ సిపి చక్రపాణి,.పాల్గొన్నా కీసర సిఐ ఆంజనేయులు..**



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర మండలం కీసర ప్రధాన కూడలిలో ఉన్న అంజనాస్ కిచెన్ రెస్టారెంట్ సి సి కెమరాలను జవహర్ నగర్ ఎసిపి చక్రపాణి ప్రారంభించారు.అనంతరం అట్టి ఎనిమిది సి సి కెమేరాలను కీసర పోలీస్ స్టేషన్ కి జియో ట్యాగ్ చేయడం జరిగింది.ఈ సంధర్బంగా ఎసిపి చక్రపాణి సర్ మాట్లాడుతూ రద్దీ ఉన్న ప్రాంతాల్లో రెస్టారెంట్స్ కానీ షాపింగ్ మాల్స్ లో సి సి కెమేరాలు తప్పని సరి ఏర్పాటు చేసుకోవాలి.అలాగే ప్రతి కెమెరాను జియో ట్యాగ్ కూడా చేయించుకోవడం తప్పనిసరి.పని చేసే కార్మికుల వివరాలు సైతం మీ సురక్ష యాప్ లో నమోదు చేయాలి పోలీస్ అధికారులు తెలిపారు.

# విద్యార్థులకు టై బెల్ట్ పంపిణీ పనులు వేగవంతం చేయాలి పాఠశాలలను సందర్శించిన డిఈఓ.





**వాస్తవ తెలంగాణ నాగర్కర్నూల్ జిల్లా ప్రతినిధి (జూలై 13):** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల, వంగూరు మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలలను సోమవారం డీఈఓ రమేష్ కుమార్ సందర్శించారు ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు.విద్యార్థులకు టైలు, బెల్టుల పంపిణీ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల కల్పన, బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ఉప్పునుంతల, వంగూరు మండలాల పాఠశాలల భోజన ప్రమాణాలను పరిశీలించి ఆయన విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదుల నిర్వహణ, బోధనా విధానాలు, నిర్మాణ పనుల పురోగతిపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.ముందుగా ఉప్పునుంతల మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులకు టైలు, బెల్టుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా టైలు, బెల్టులను పంపిణీ చేసి వారితో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి, పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈఓ రమేష్ కుమార్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేశారు. బోధనలో మరింత నాణ్యత పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులనుఅవలంబించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలల హాజరు నమోదులను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పెరిగేలా తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని, పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి విద్యలో వెనుకబడకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను కూడా డీఈఓ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి విద్యార్థుల వినియోగానికి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తోందని, ఉపాధ్యాయులు కూడా అదే స్థాయిలో బాధ్యతతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

డీఈఓ రమేష్ కుమార్ వెంట సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# చారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పరిశీలించిన కలెక్టర్

**అంగన్వాడీలో నులిపురుగుల నివారణ కార్యక్రమం పోషకాహార పంపిణీపై కలెక్టర్ ఆరా.**
**రోగులకు నాణ్యమైన వైద్యం, చిన్నారులకు మెరుగైన పోషకాహారం అందించాలి.**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్.**



**నాగర్ కర్నూల్ జిల్లా వాస్తవ తెలంగాణ (జూలై 13)** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పరిశీలించారు మండల కేంద్రంలోని ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు చికిత్స, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. వైద్యులు విధుల్లో సమయానికి హాజరవుతున్నారా, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా, అవసరమైన మందులు, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై వైద్యాధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కూడా సూచించారు. అనంతరం సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మాత్రలు పంపిణీ జరుగుతున్నాయా అనే అంశాన్ని తెలుసుకున్నారు. ఏ వయస్సు పిల్లలకు ఎంత మోతాదులో మాత్రలు ఇస్తున్నారో అడిగి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అర మాత్ర, రెండు నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక్క మాత్ర చొప్పున అందజేస్తున్నట్లు ఏఎన్ఎంలు కలెక్టర్‌కు వివరించారు. ఈ విధానాన్ని ప్రశంసించిన కలెక్టర్, అర్హులైన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా మాత్రలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాత్రలు పంపిణీ చేసిన అనంతరం చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా అసౌకర్యాలు తలెత్తితే వెంటనే వైద్య సహాయం అందించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు ఆదేశించారు. మాత్రల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలనిసూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులతో కలెక్టర్ కొంతసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. తన మొబైల్ ఫోన్‌లో డైనోసార్ చిత్రాలను చూపిస్తూ చిన్నారులను ఆనందపరిచారు. పిల్లలతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యం, నేర్చుకునే ఆసక్తిని గమనించారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధన అందిస్తూ వారి మానసిక వికాసానికి దోహదపడేలా అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, గుడ్ల పంపిణీ, పాలు, ఇతర పోషకాహార పదార్థాల సరఫరా, వాటి నాణ్యత, పంపిణీ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్, భద్రత వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి లబ్ధిదారునికి పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్త ఉన్నారు.

# గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడుదాం..!

**జర్నలిస్టులపై రాజకీయాలు చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్..**
**మీడియాపై ఇలాంటి వివక్ష ఎప్పుడు చూడలేదు..**
**ముఖ్యమంత్రిని బదునాం చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**
**టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య..**
**ఈ సుద్దపూసల బండారం బయటపెట్టాలి - జర్నలిస్ట్ కేపీ**
**గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలి - జిల్లా అధ్యక్షుడు గణేష్..**
**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు "టిడబ్ల్యూజేఎఫ్" జర్నలిస్టుల ఆందోళన**
**కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు**





**ప్రజా ప్రతినిధి జులై 13 వాస్తవ తెలంగాణ** సమాజంలో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాం.. ఇప్పుడు పోరాడే జర్నలిస్టులే సమస్యల్లో పడ్డారు.. అయినా వదిలి పెట్టేది లేదు.. మనకోసం మనమే పోరాడుదాం.. గల్లి నుంచి ఢిల్లీ దాకా మన పోరాటాన్ని కొనసాగిద్దాం.. అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అక్కడికి చేరుకొని కార్యాలయం గేటు ముందు ఆందోళన నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లాకు అధ్యక్షుడు శేరీబాయి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవేందర్, ఎండి ఖాజాపాషా కేపి, శ్రీనివాసచారి, చంద్రశేఖర్, మన్సూర్ అలీ ఖాన్, శ్రీశైలం, నరసింహారెడ్డి, రాజశేఖర్ తదితరులతో పాటు షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, అమన్ గల్, శంషాబాద్, చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట్ తదితర ప్రాంతాల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా అక్రిడేషన్ కార్డు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తదితర విషయాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూ.. చిన్న సమస్యల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి జర్నలిస్టులకు ఏర్పడుతుందని, ఇది అత్యంత దారుణమని అన్నారు. ఇదంతా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆడిస్తున్న నాటకం అని, దీనిపై ప్రశ్నించడానికి వెళితే కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బదనాం చేస్తుందని ఆరోపించారు. ఎలాంటి సమస్యలనైనా తమ వార్తల ద్వారా తెలియజేసే జర్నలిస్టులు చిన్న సమస్యల కోసం పోరాడాల్సిన దుస్థితి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఎదుర్కొంటున్నామని అన్నారు. 40 ఏండ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ రైల్వే పాసు సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడేందుకు త్వరలో జర్నలిస్టులు ఢిల్లీ వెళ్లాల్సి ఉందని తెలిపారు. ఇక్కడ గల్లి అయిన అక్కడ ఢిల్లీ అయినా టిడబ్ల్యూజేఎఫ్ ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కొన్ని జర్నలిస్టు యూనియన్లు రాజకీయ పార్టీలలా వ్యవహరిస్తూ జర్నలిజంలో రాజకీయాలు తెచ్చి విభజించి పాలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రిని, మంత్రి పొంగులేటిని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. జర్నలిస్టులకు రైలు, మెట్రో రైలులో కూడా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశామని తెలిపారు. అలాగే విద్య, వైద్యం విషయంలో సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్నారు.

**తీగ లాగుతాం.. డొంక కదిలిస్తాం..**
**టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీ**

కొంతమంది అధికారులు అంతా రూల్స్ ప్రకారమే వెళుతున్నామని బిల్డప్పులు ఇస్తున్నారు.. కానీ చదువురాని వాళ్లకు కూడా గుర్తింపు కార్డులు జారీ చేశారనీ, కానీ దశాబ్దాలుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న వారిని మాత్రం పక్కన పెట్టారన్నారు. దీనిని వదిలిపెట్టేది లేదు.. తీగలాగితే డొంక కదిలిస్తాం.. అని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జర్నలిస్ట్ కేపీ అన్నారు. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అక్రిడేషన్ గుర్తింపు కార్డుల విషయంలో ఇంత దారుణాన్ని ఇప్పటిదాకా చూడలేదని, జర్నలిస్టులను పనిగట్టుకొని కొందరు వెంటాడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని వారికి ఎంతమందికి అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు ఆ జాబితా తమ వద్ద ఉన్నాయని త్వరలోనే అక్రిడేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరించారు. దీనిపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుద్దపూసల వ్యవహరిస్తున్న అధికారుల బండారాన్ని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. నిరంతరం వార్తల ద్వారా ప్రజల్లో ఉండి సేవలు అందిస్తూ, నాయకులకు ప్రచారం కల్పించే జర్నలిస్టుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. చాలామంది జర్నలిస్టులను కార్డులు ఇవ్వకుండా వేధిస్తున్న ఈ తీరుపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస అవగాహన లేని, అక్షరం ముక్క రాయలేని జర్నలిస్టులకు కార్డులు ఇచ్చారు.. ఇంగ్లీషు రాయడం చేతకాని జర్నలిస్టులకు ఆంగ్ల పత్రికల్లో కార్డులు ఇచ్చారు.. ఫీల్డ్ కు సంబంధం లేని వారికి కూడా కార్డులు ఇచ్చారని, కానీ దశాబ్దాలుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న జర్నలిస్టులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాడి హక్కులను సాధించుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు.

**జర్నలిస్టును గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలి..**
**టియుడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్**

సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులను గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ప్రక్రియలో పూర్తిస్థాయిలో పక్షపాత ధోరణి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రజాస్వామ్య యుతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను చూసి వారి తరఫున ప్రచారం చేసి గెలిపిస్తే గెలిచాక జర్నలిస్టులను పూర్తిగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం, వైద్య సదుపాయం కల్పించడం, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య లక్ష్యంగా ఈ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. సూర్య దినపత్రికను అదేవిధంగా మరికొన్ని దినపత్రికలను కక్షపూరిత ధోరణిలో పక్కన పెట్టారని ఇదంతా యూనియన్ల రాజకీయమని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని ఎల్లప్పుడూ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి ఉండడని అవకాశం మాకు కూడా వచ్చినప్పుడు తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు అన్నారు. హైదరాబాదులో ఈ నెల 15వ తేదీన జరిగే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల జర్నలిస్టులు రఘు, నరేష్, గోపాల్, బుచ్చన్న, యాదగిరి, జగన్, నరసింహ, సురేంద్ర, శంకర్, కస్తూరి రంగనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి, రాకేష్, కృష్ణ, ధరశీపాల్, శివ కుమార్, నరేందర్ గౌడ్, రామకృష్ణ, శ్రీకాంత్, ఆవుల రమేష్, శంకర్, చంద్రశేఖర్ గౌడ్, షకీల్, రియాజ్, ఖాలేద్ శ్యామ్ కుమార్, బూర్గుల రమేష్, మంచలం రమేష్, బండి గోపాల్, సత్యనారాయణ, రవి, రాజు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఒక యుద్ధం లాంటిింది, అందరూ సైనికుల్లా పని చేయాలి




**వాస్తవ తెలంగాణ** తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్ వెన్నెల గద్దర్ సర్ ప్రక్రియ వేగవంతం కోసం బిఎల్ఏ లకు, నాయకులకు దిశా నిర్దేశం చేసిన జగ్గారెడ్డి, నిర్మల ప్రత్యేక సమగ్ర సవర ఎస ఐ ఆర్అనేది ఒక యుద్ధం లాంటిదని, దీన్ని ఎదుర్కొనేందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుని లాగా పోరాడాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ కార్పొరేషన్ చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ , ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమగ్ర సవరణ పై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బిఎల్వో లు మీ దగ్గరకు రాకున్నా మీరే వెళ్లాలని బిఎల్ఏ లు, నాయకులకు సూచించారు. ఓట్ నమోదు కాకపోతే వ్యక్తిగతంగా ఓటర్ కే నష్టం కాబట్టి ఓటర్ లు కూడా తమ ఓటహక్కును నమోదు చేసుకోవాలనే ఆతృత, ఆసక్తి ఉండాలన్నారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదురోజుల్లోనే సర్ ప్రక్రియ పూర్తి అయ్యేలా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ పని మనది, మన సంగారెడ్డి కోసం పని చేస్తున్నామనే విషయాన్ని దృష్టి లో పెట్టుకుని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు కూన వనితా సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, నాయకులు కూన సంతోష్, షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్, రఘు గౌడ్, జార్జ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా" బర్ల సూరి"

**జువ్వడి నేతృత్వంలో బర్ల సూరికి కీలక బాధ్యతలు**



**కోరుట్ల నియోజకవర్గప్రతినిధి,జులై 13; వాస్తవ తెలంగాణ**కోరుట్ల నియోజకవర్గం మెట్పల్లి మున్సిపాలిటీ 3వ వార్డుకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు బర్ల సూరిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ "టీపీసీసీ" జగిత్యాల జిల్లా జనరల్ సెక్రటరీ (ప్రధాన కార్యదర్శి)గా నియమించింది. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, అహర్నిశలు చేస్తున్న సేవలు, మరియు సత్ప్రవర్తనను గుర్తించి సీనియర్ కాంగ్రెస్ నాయకులు "జువ్వడి నర్సింగరావు "నేతృత్వంలో అధిష్ఠానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే బర్ల సూరి ఇంత చిన్న వయసులోనే జిల్లా స్థాయి పదవిని కైవసం చేసుకోవడం పట్ల నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు ఆయనను కలిసి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతలను అప్పగించినందుకు జువ్వడి నర్సింగరావుకి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి బర్ల సూరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు



**వాస్తవ తెలంగాణ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (జులై 13):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో సోమవారం మహాశైవాక్షయోగం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సోమవారం కావడంతో ఉదయం నుండే భక్తులు శివుడిని దర్శించుకుని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, శివారాధన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చిదంబర శర్మ మాట్లాడుతూ సోమవారం శివునికి పూజలు, అభిషేకాలు చేయడం వల్ల వంద మహాశివరాత్రుల పుణ్య ఫలితాన్ని ఇస్తుందని సకల పాపాలు తొలగిపోయి సుఖసంతోషాలు చేకూరుతాయని తెలిపారు.

# తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కామగల్ల నరేష్ నియామకం



**వాస్తవ తెలంగాణ** తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (పి వై జె ఎఫ్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కామగల్ల నరేష్‌ను నియమించారు. పి వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు సంస్థ నాయకులు తెలిపారు.సంస్థ బలోపేతం, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, యువ జర్నలిస్టుల అభివృద్ధి కోసం కృషి చేయగల నాయకత్వ లక్షణాలను గుర్తించి కామగల్ల నరేష్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ నియామక కార్యక్రమం టి వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు కామగల్ల నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులుతనుగుల జితేందర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# సర్ లో తప్పనిసరిగా వివరాలను నమోదు చేసుకోవాలి



**వాస్తవ తెలంగాణ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (జూలై 13):** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు మధుర నగర్ కాలనీలో నిర్వహించి సర్ ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పేరుమల రాజేష్ తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు సర్ ప్రక్రియ పై అవగాహన కల్పిస్తూ ప్రతి ఓటరు సర్ లో వివరాలను నమోదు చేసుకోవాలని లేదంటే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని సూచించారు.

# గ్రామీణ ప్రాంతాల్లో అధికశాతం ఓటర్లు నిరక్షరాస్యులు కాబట్టి సర్ ముగింపు తేదీని పొడిగించాలి

**టీఎన్జీవో పక్కన గల ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా కడుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలి.**
**అత్యవసర సేవలు అందిస్తున్న 108 సిబ్బందికి మానవత్వంగా జిల్లా కేంద్రంలో ఒక రూం కేటాయించాలి.**
**కేజీబీవీ ఎస్ ఓ మరియు సిబ్బంది బదిలీలు చేపట్టాలి.**
**జిల్లాలో విద్యాశాఖపై పూర్తి స్థాయి సమీక్ష సమావేశం చేపట్టాలి.**
**ప్రజావాణి కార్యక్రమంలో బి.ఎస్.పి కలెక్టర్ కు వినతి.**



**వాస్తవ తెలంగాణ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (జులై 13):** గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ఓటర్లు నిరక్షరాస్యులుగా ఉన్నందువల్ల సర్ ముగింపు తేదీని పొడిగించాలని నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో పక్కన గల ప్రభుత్వ స్థలంలో అనధికారకంగా కడుతున్న అక్రమ నిర్మాణం పై విచారణ చేపట్టాలని అత్యవసర సేవలు అందిస్తున్న 108 వాహన సిబ్బందికి మానవత్వంగ జిల్లా కేంద్రంలో ప్రత్యేక గది కేటాయించాలని మరియు కేజీబీవీఎస్ఓ సిబ్బంది బదిలీలను చేపట్టాలని జిల్లాలో విద్యాశాఖ పై పూర్తిస్థాయి సమీక్ష సమావేశం చేపట్టాలని కోరుతూ సోమవారం డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఈ నెల 24 వరకూ ఓటర్లకు ఇచ్చిన సర్ గడువు ముగుస్తుందని, కాకపోతే అత్యధిక ఓటర్లు నిరక్ష్యరాస్యులని వారి ఫామ్ వారు నింపడానికి ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందని, అట్లాగే 2002 ఓటర్ లిస్ట్ జన బహుళ్యంలో అందుబాటులో లేకపోవడం, జిల్లాలో ఎక్కువమంది ప్రజలు వలసలు వెళ్తారని, ఉద్యోగస్తులపై విపరీతమైన ఒత్తిడి ఉండటం వలన, ఇంకా ఇతరత్ర కారణాల వలన గడువులోపు ప్రజలు ఫామ్స్ ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోవాల్సి వస్తుందని కావున ముగింపు తేదీనీ పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు జిల్లా కలెక్టర్ ద్వారా విన్నవించారు. అట్లాగే నాగర్ కర్నూల్ మెయిన్ రోడ్డుపై గల టిఎన్జీవో భవనం పక్కన నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో ప్రయివేట్ వ్యక్తులు అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్నారని కావున అట్టి అక్రమ నిర్మాణలపై విచారణ చేపట్టి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవ్వకుండా చూడాలని అన్నారు. అట్లాగే 24/7 అత్యవసర విధులు నిర్వహించే 108 సిబ్బందికి గతంలో ఎంపీడీఓ కార్యాలయంలో రూ ఉండేదనీ, కానీ గత కొన్ని నెలలుగా ఎక్కడ రూం సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున మానవత్వక రూపంగా వారికి రూం సౌకర్యం కల్పించాలని కోరారు. గత రెండు రోజుల క్రితం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ ఆశ్రమ పాఠశాలలో 27 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిషన్ అయిందనీ, గత విద్యా సంవత్సరం కూడా వివిధ ప్రభుత్వ హాస్టళ్ళు - గురుకులాల్లో ఫుడ్ పాయిషన్ అయిందని, ఇ విద్యా సంవత్సరం అలా జరగకుండ ముందు జాగ్రత్తగా అన్ని సంక్షేమ శాఖల(ఏస్సీ, ఎస్టి, ఓబీసీ మరియు మైనారిటీ) హాస్టళ్ళ జిల్లా అధికారులు, వార్డెన్స్, కేజీబీవీ ఎస్ ఓ లు మరియు సంక్షేమ శాఖల గురుకులాల ప్రిన్సిపాల్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించాలని కోరడం జరిగింది. అట్లాగే జిల్లాలో ఉన్న కేజీబీవీ ఎస్ ఓ లు ఓకే దగ్గర 10సం.రాలకు పైబడి విధులు నిర్వహించడం వలన విధుల్లో పూర్తిస్థాయి నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కావున కేజీబీవీ ఎస్ ఓ లు మరియు సిబ్బందికి జిల్లా స్థాయిలో లేదా డివిజన్ స్థాయిలో పూర్తి స్థాయి బదిలీలు చేయాలనీ వినతి పత్రంలో కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ పార్లమెంట్ ఇంచార్జ్ సి.కళ్యాణ్, జిల్లా కార్యదర్శి బి.దాస్, పార్టీ నాయకులు కాకునూరి మధు, నాగరాజ్, బాలరాజు, అర్జున్, బీవీఫ్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి బాధ్యతతో విజయవంతం చేయాలి -- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి





**అల్వాల్ సర్కిల్ జూలై 13 వాస్తవ తెలంగాణ** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎలాంటి అశ్రద్ధకు తావులేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లకు (బిఎల్ఏ) లకు సూచించారు. ఈ సందర్భంగా 192 టెంపుల్ అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ బి ఎల్ ఏ లతో ప్రత్యేక అవగాహన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీతో పాటు కొత్త ఓటర్ల నమోదు, పేర్ల చేర్పులు, మార్పులు, చిరునామా మార్పులు, షిఫ్టింగ్ అయిన ఓటర్ల వివరాల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై బీఎల్ఏల నుంచి వివరాలు తెలుసుకున్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేని అర్హుల నమోదు విధానం, ఒకే కుటుంబంలో కొంతమంది సభ్యుల పేర్లు మాత్రమే ఉండి మిగిలిన వారి పేర్లు లేకపోతే అనుసరించాల్సిన విధానం, ఈసీ నెట్ పోర్టల్‌లో బూత్ నంబర్ నమోదు చేసినప్పుడు వేరే బూత్ వివరాలు చూపిస్తున్న సాంకేతిక సమస్య, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ కొందరికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు అందకపోవడం, వృద్ధులకు ఫారమ్‌లు అందక ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులు వంటి అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, చనిపోయిన వారు లేదా డబుల్ నమోదైన ఓటర్ల పేర్ల తొలగింపుకు ఫారం-7, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం-8 వినియోగంపై బీఎల్ఏలకు ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. బీఎల్ఏలు ప్రస్తావించిన సమస్యలను వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి బాధ్యతతో సర్వేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తోట నరేందర్ రెడ్డి, నెమూరి శ్రీధర్ గౌడ్, డోలి రమేష్, సురేందర్ రెడ్డి, సందీప్, రెహ్మత్ ఖాన్, అరుణ్, ప్రశాంత్, వీణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.